ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :139 ఆదివారం మార్చి 15 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA /ANDHRAPRADESH

## బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు నా జీవితం మంత్రి సీతక్క

**•షీ స్పార్క్స్ 2026 కార్యక్రమంలో ప్రసంగం**

**•ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశాలతోనే మార్పు సాధ్యమైంది**

**•మహిళల ఆర్థిక సాధికారతపై ప్రభుత్వ చర్యలు**



న్యూఢిల్లీ, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు తన జీవిత ప్రయాణం ప్రజాస్వామ్యం కల్పించిన అవకాశాల ఫలితమని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన 'షీ స్పార్క్స్ 2026' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఢిల్లీలోని ఐటీసీ ప్రాంగణంలో జాతీయ మీడియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తన జీవిత ప్రయాణం, ప్రజాసేవలోకి వచ్చిన విధానం, మంత్రిగా తీసుకున్న కీలక నిర్ణయాలపై నిర్వాహకులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు, పరిశోధకులు, ఐటీ నిపుణులు, రచయితలు, కళాకారులు, పరిపాలనాధికారులు వంటి అనేక రంగాల్లో ప్రతిభ చూపుతున్న మహిళలను ఒకే వేదికపైకి తీసుకురావడం సంతోషకరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళల నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడంలో సహాయపడతాయని చెప్పారు. తాను రాజకీయ కుటుంబం నుంచి రాలేదని, ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ప్రజాసేవలోకి వచ్చానని గుర్తుచేశారు. ఒకప్పుడు అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన తన జీవితం తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం పెరిగి ప్రధాన ప్రవాహంలోకి వచ్చానని మంత్రి తెలిపారు. విద్య ద్వారా జీవితాన్ని మార్చుకోవచ్చని నమ్మి న్యాయ విద్యను అభ్యసించి న్యాయవాదిగా పనిచేశానని, అనంతరం ప్రజల సేవ కోసం ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించానని చెప్పారు. ఒకప్పుడు న్యాయస్థానంలో నిందితురాలిగా నిలిచిన తాను, తర్వాత అదే కోర్టులో న్యాయవాదిగా నిలిచిన సందర్భం తన జీవితంలో పెద్ద మలుపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి వివరించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం ద్వారా రాష్ట్రంలో 46 లక్షలకుపైగా మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి సామాజిక, ఆర్థిక మార్పుకు దోహదపడుతున్నారని చెప్పారు. బ్యాంకు లింకేజీలు, చిన్న మరియు మధ్య తరహా వ్యాపారాలకు రుణాలు, మార్కెట్ అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి విధానం ద్వారా మహిళలకు పెద్ద స్థాయిలో వ్యాపార అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. స్వయం సహాయక సంఘాలు బస్సులు నిర్వహించడం, కమ్యూనిటీ క్యాంటీన్లు నడపడం, వరి కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం, పాఠశాల యూనిఫార్మ్‌లు తయారు చేయడం వంటి అనేక రంగాల్లో ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్ ద్వారా గ్రామీణ మహిళలు తమ ఉత్పత్తులను నగర మార్కెట్‌కు నేరుగా విక్రయించే అవకాశాన్ని కల్పించామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు బలపడతాయని, సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క అన్నారు.

## పెళ్లికి నిరాకరించిందని యువతికి ఎయిడ్స్ రక్తం ఇంజెక్ట్ చేసిన యువకుడు

**✦పోచారంలో దారుణ ఘటన**

**✦వివాహం నిరాకరించడంతో కక్ష తీర్చుకున్న నిందితుడు**

**✦నిందితుడు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

హైదరాబాద్, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ నగర పరిధిలోని పోచారం ప్రాంతంలో అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. పెళ్లికి నిరాకరించిందనే కోపంతో ఓ యువకుడు యువతిపై దారుణానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. యువకుడు మనోహర్ అనే వ్యక్తి యువతికి ఎయిడ్స్ ఉన్న రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం, బాధిత యువతికి మనోహర్‌తో వివాహం నిశ్చయమైంది. అయితే అనంతరం మనోహర్‌కు ఎయిడ్స్ ఉన్నట్లు యువతికి తెలిసింది. దీంతో ఆమె ఆ వివాహానికి నిరాకరించినట్లు సమాచారం. ఈ విషయం మనోహర్‌కు ఆగ్రహం కలిగించడంతో యువతిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 11న యువతి ఇంటికి వెళ్లిన మనోహర్, మరోసారి పెళ్లి విషయంపై మాట్లాడే



ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. యువతి మరోసారి వివాహానికి నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన మనోహర్ ఆమెకు ఎయిడ్స్ ఉన్న రక్తాన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనతో యువతి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి నిందితుడు మనోహర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బాధిత యువతికి వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

## నర్మెట్టలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాట్ల పరిశీలన



**-ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈనెల 22న ప్రారంభం**

**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**-పరిశ్రమ ప్రారంభానికి అధికారులు వేగంగా ఏర్పాట్లు**





సిద్దిపేట, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభించనున్న నేపథ్యంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఫ్యాక్టరీ ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు చేపడుతున్న పనుల గురించి వివరాలు తెలుసుకున్న మంత్రి, ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఫ్యాక్టరీ ప్రారంభానికి అవసరమైన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. నర్మెట్టలో ఏర్పాటైన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రాంతీయ రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం లభించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం అందే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ ప్రారంభం తర్వాత స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. రైతులు పండించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని తెలిపారు. రైతులు పండించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్ సౌకర్యం కల్పించడంతో పాటు వ్యవసాయ రంగానికి కొత్త అవకాశాలు తెరుచుకుంటాయని తెలిపారు.

## హయత్‌నగర్‌లో రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన



**-రూ.10 కోట్లతో 2 లేన్ రహదారి 4 లేన్లుగా విస్తరణ**

**-ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి కీలక అడుగు**

**-ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ ప్రాంతంలో రహదారి విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 2 లేన్ రహదారిని 4 లేన్ రహదారిగా విస్తరించే అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగర పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ రహదారి విస్తరణతో స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగర పరిధి విస్తరిస్తున్న కొద్దీ వాహనాల రాకపోకలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న ఈ రహదారిపై వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించడం ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గడమే కాకుండా ప్రజలకు సురక్షితమైన ప్రయాణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. రహదారి విస్తరణ పూర్తయిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు సమయం ఆదా కావడంతో పాటు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా మారుతుందని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరం దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా నిలుస్తోందని మంత్రి అన్నారు. ఈ అభివృద్ధికి అనుగుణంగా మౌలిక వసతులను కూడా బలోపేతం చేయడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని




## గ్యాస్ కొరతతో సిలిండర్ చోరీలు... ద్వారకాతిరుమలలో ఘటన

**-అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడి గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లిన దొంగలు**

**-గ్యాస్ కొరతను ఆసరాగా చేసుకుంటున్న నేరగాళ్లు**

**-కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



ఏలూరు, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య కొనసాగుతున్న యుద్ధం ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలపై పడుతోంది. ఈ పరిస్థితుల వల్ల చమురు, గ్యాస్ సరఫరాల్లో అంతరాయం ఏర్పడి భారత్‌లో కూడా ప్రభావం కనిపిస్తోంది. ముఖ్యంగా వంటగ్యాస్ కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లు సకాలంలో అందక ప్రజలు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గ్యాస్ కొరతను ఆసరాగా చేసుకుని కొంతమంది బ్లాక్ మార్కెట్‌లో గ్యాస్ సిలిండర్లను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దీనికి తోడు కొంతమంది దొంగలు గ్యాస్ సిలిండర్లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. గ్యాస్ సిలిండర్లకు డిమాండ్ పెరగడంతో వాటిని దొంగిలించి విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో గ్యాస్ సిలిండర్ చోరీ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఓ ఇంట్లోకి అర్ధరాత్రి సమయంలో దొంగలు చొరబడి వంటగ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్లారు. ఇంటి యజమానులు పని మీద బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి సిలిండర్ కనిపించకపోవడంతో ఈ ఘటన బయటపడింది. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతంలో సీసీటీవీ కెమెరాలు మరియు ఇతర ఆధారాల ఆధారంగా దొంగలను గుర్తించే ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గ్యాస్ కొరత పరిస్థితుల్లో ఇలాంటి ఘటనలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు.

# హయత్‌నగర్‌లో రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన

మెదటి పేజీ తరువాయి



చెప్పారు. రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సదుపాయాలు, ప్రజా సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. హయత్‌నగర్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చేందుకు ఇలాంటి ప్రాజెక్టులు ఎంతో అవసరమని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో నగర పరిసర ప్రాంతాల్లో మరిన్ని రహదారి విస్తరణ పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన మరియు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. నగర అభివృద్ధి వేగానికి అనుగుణంగా అన్ని రంగాల్లో మౌలిక వసతులను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

# మచిలీపట్నంలో ఉద్రిక్తత.. జనసేన నేత హంగామా

**-పేర్ని నాని ఇంటి ముందు డీజేలతో కవ్వింపు చర్యలు**
**-పవన్ కళ్యాణ్ పాటలతో హడావిడి చేసిన జనసేన నేత కొరియర్ శ్రీను**
**-అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం**



మచిలీపట్నం, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ మంత్రి పేర్ని నాని నివాసం ముందు జనసేన పార్టీకి చెందిన నేత కొరియర్ శ్రీను డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి హంగామా సృష్టించిన ఘటన కలకలం రేపింది. పవన్ కళ్యాణ్‌కు సంబంధించిన పాటలను పెద్ద శబ్దంతో ప్లే చేస్తూ అక్కడ హడావిడి చేయడంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ముందుకు వెళ్లాలని పోలీస్ అధికారులు సూచించినప్పటికీ జనసేన నేత కొరియర్ శ్రీను పోలీసులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. పోలీసులు అడ్డుకోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే నిరసన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తనను అడ్డుకున్న పోలీసులను పక్కకు తోసివేయడానికి ప్రయత్నించడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించిన పోలీసులు అక్కడ భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై పోలీసులు తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.



# గ్రీన్ కార్డుల కోసం చోరీల డ్రామా

**-అమెరికాలో 11 మంది భారతీయులు అరెస్ట్**
**-యూ వీసా కోసం దోపిడీ కథలు సృష్టించిన ముఠా**
**-పలు రాష్ట్రాల్లో దర్యాప్తు కొనసాగింపు**




వాషింగ్టన్, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): అమెరికాలో అక్రమంగా నివసిస్తూ వీసా మోసాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై 11 మంది భారతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రీన్ కార్డులు పొందేందుకు చోరీలు జరిగాయన్నట్లు నాటకాలు ఆడినట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. దోపిడీ ఘటనల్లో తాము బాధితులమని కట్టుకథలు అల్లి యూ వీసా పొందేందుకు ప్రయత్నించినట్లు అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. హింసాత్మక నేరాల్లో బాధితులైన విదేశీయులు అమెరికాలో చట్టబద్ధంగా ఉండేందుకు యూ వీసాకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ వీసా ద్వారా వలసదారులకు పని అనుమతులు లభించడంతో పాటు కొన్ని సంవత్సరాల తరువాత గ్రీన్ కార్డు పొందే అవకాశం ఉంటుంది. ఈ నిబంధనను ఆసరాగా చేసుకుని కొందరు వలసదారులు మోసాలకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మసాచుసెట్స్, కెంటకీ, ఒహాయో తదితర రాష్ట్రాల్లో 11 మంది భారతీయులను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరిలో ఒకరిని భారత్‌కు డిపోర్ట్ చేయగా మరో ఆరుగురిని కోర్టులో హాజరుపరచి విడుదల చేశారు. మిగతా నలుగురిని రిమాండ్‌లో ఉంచారు. నిందితులు ముఠాగా ఏర్పడి ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాలు, ఇతర స్టోర్ల వద్ద దోపిడీలు జరిగినట్లు చూపించి తరువాత తాము బాధితులమంటూ యూ వీసాలకు దరఖాస్తు చేసే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో నేరం నిరూపితమైతే నిందితులకు ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు 2.5 లక్షల డాలర్ల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# 10వ తరగతి పరీక్ష కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భారీ భద్రత



మొగుడంపల్లి మార్చి 14 ( మనప్రజాప్రతినిధి): సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండల కేంద్రంలోని మార్చ్14వ తేదీ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9,30 నిమిషాల నుండి 12 గంటల 30 నిమిషాల వరకు 10వ తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతుంది చిరాగ్ పల్లి ఎస్ఐ కె రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బృందం వారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా కట్టుదిట్టమైన భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు ఈ సందర్భంగా ఎస్సై కే రాజేందర్ రెడ్డి పలు హెచ్చరికలు జారీ చేశారు పరీక్ష కేంద్రం వద్ద 163, బి ఎన్ ఎస్ ఎస్, 144, సెక్షన్ విధించడం జరిగిందని ఇద్దరు లేక ముగ్గురు వ్యక్తులు గుంపులు గుంపులుగా తిరుగొద్దని స్థానిక జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఎవరైనా వ్యక్తులు పరీక్ష కేంద్రం నుండి 100 మీటర్లుల దూరంఉండాలని ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఎవరైనా ఈ సెక్షన్లు ఉల్లంఘించినట్లయితే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేయడం జరుగుతుందని చిరాగ్ పల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు

# పాడేరు నియోజకవర్గంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం

**-మారుమూల గిరిజన గ్రామంలో పార్టీ పతాకం ఆవిష్కరణ**
**-కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**
**-ఏజెన్సీ ప్రాంత రోడ్లను పరిశీలించిన నేతలు**



పాడేరు, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): పాడేరు నియోజకవర్గంలో జనసేన పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మారుమూల గిరిజన గ్రామమైన ఓనూరులో ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ స్థాపన నుంచి ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. పాడేరు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో రవాణా, విద్య, వైద్యం వంటి సౌకర్యాలను మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం అడవితల్లి బాట పథకంలో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో నిర్మించిన బీటీ రోడ్లను ఉప ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని అధికారులు వివరించగా, పనులు నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని అన్నారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని నేతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరుస్తున్నారు వైఎస్ షర్మిల

**-పాయకరావుపేటలో శ్రామికులతో కలిసి కరువు పని**
**-కాంగ్రెస్ పరిరక్షణ యాత్రలో భాగంగా కార్యక్రమం**
**-100 రోజుల ఉపాధిపై కార్మికులకు భరోసా**



పాయకరావుపేట, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు ముఖ్యమైన ఆధారమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. గ్రామాల్లో పేదరికాన్ని తగ్గించి, వలసలను నిరోధించి, గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేసిన గొప్ప పథకం ఇదేనని ఆమె తెలిపారు. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని బలహీనపరుస్తోందని ఆమె ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా పాయకరావుపేటలో శ్రామికులతో కలిసి ఆమె కరువు పనిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో తగిన పనులు కల్పించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె విమర్శించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, అలాంటి కీలక పథకాన్ని బలహీనపరచడం సరైంది కాదని ఆమె అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గ్రామీణ కార్మికులకు 100 రోజుల ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించేందుకు పోరాటం కొనసాగిస్తామని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడేందుకు మరియు వారికి హక్కుగా లభించాల్సిన ఉపాధిని నిర్ధారించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఆమె తెలిపారు.



# 'వనరాణి మినీ ట్రైన్' పునఃప్రారంభం...

**-పర్యాటకానికి కొత్త ఊపునిచ్చే ప్రయత్నం**
**-పర్యావరణ హిత బ్యాటరీ ఇంజిన్‌తో ఆధునికీకరణ**
**-ప్రారంభోత్సవంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్**



ముంబై, మార్చి 14 (మనప్రజాప్రతినిధి): ముంబైలోని సంజయ్ గాంధీ నేషనల్ పార్క్‌లో 'వనరాణి మినీ ట్రైన్' పునఃప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మహారాష్ట్ర అటవీ శాఖ మంత్రి గణేష్ నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. పర్యాటకులను ఆకర్షించే ఈ ప్రత్యేక మినీ ట్రైన్ సేవను ఆధునికీకరించి మళ్లీ ప్రారంభించడం పార్క్ అభివృద్ధిలో ముఖ్యమైన అడుగుగా అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు మినీ ట్రైన్‌ను ఆధునిక సాంకేతికతతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పర్యావరణానికి హాని కలగకుండా బ్యాటరీ ఆధారిత శక్తి సామర్థ్యంతో పనిచేసే కొత్త ఇంజిన్‌ను ఇందులో ఏర్పాటు చేశారని వివరించారు. అలాగే ఆధునిక కోచ్‌లు, ట్రాక్ పరిసరాల్లో అందమైన ల్యాండ్‌స్కేపింగ్, అలంకరణ పనులు చేపట్టడం ద్వారా ప్రయాణికులకు మరింత ఆకర్షణీయ అనుభవం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సంజయ్ గాంధీ నేషనల్ పార్క్‌కు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రోత్సాహం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రకృతి సంరక్షణతో పాటు అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుతూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ప్రాంతీయ అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని అన్నారు.

# ప్రశాంతంగా జరుగుతున్న పదవ తరగతి పరీక్షలు



మనప్రజాప్రతినిధి//ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి మొదటి రోజు పరీక్షకు 99.88 శాతం విద్యార్థులు హాజరు రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాల, మౌంట్ ఫోర్ట్ స్కూల్ లలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.శనివారం జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రకాష్ నగర్ రోడ్ లోని మౌంట్ ఫోర్ట్ స్కూల్ లలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్ష జరుగుతున్న తీరు, పరీక్షా కేంద్రాలలో నిర్వహణ విధానం, ప్రశ్నపత్రాల భద్రత, హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు చల్లని త్రాగు నీరు సరఫరా చేయాలని, పరీక్ష కేంద్రానికి వచ్చే ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించాలని తెలిపారు. పరీక్ష గదుల్లో వెలుతురు, త్రాగునీరు, టాయిలెట్ నిర్వహణ సక్రమంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ధైర్యం చెప్పారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో, బాధ్యతగా నిర్వహించాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.శనివారం జిల్లాలో జరిగిన పదవ తరగతి పరీక్షకు 99.88 శాతం విద్యార్థులు హాజరు కావడం జరిగిందని, 16 వేల 962 విద్యార్థులకు గాను మొత్తం 16 వేల 941 మంది విద్యార్థులు హాజరు అయ్యారని తెలిపారు.జిల్లా కలెక్టర్ పరీక్షా కేంద్రం తనిఖీ సమయంలో సంబంధిత అధికారులు వెంట ఉన్నారు

# తాగునీటి ఎద్దడి పట్ల ముందస్తు చర్యలు చేపట్టాలి



నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )జిల్లాలో తాగునీటికి సాగునీటికి ఇబ్బంది రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు శనివారం నాడు ఆయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండల కేంద్రంలో జరిగిన సిపిఐ పార్టీ ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .... గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తాగునీటికి ఎద్దడి రాకుండా చూడాలని ఈ ప్రాంతంలో ఉన్న అన్ని చెరువులను నింపాలని చేపలు పట్టే వంకతో కాంట్రాక్టర్లు చెరువులు ఖాళీ చేయకుండా చూడాలని ఎవరైనా రాత్రివేళలో దొంగతనంగా చెరువులు ఖాళీ చేపిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఈ యాసంగి పంటకు చివరి భూములకు నీరు అందేలా చూడాలని పొలాలు ఈ నెలాఖరు వరకు కోతకు వస్తాయని ఇప్పుడు నీరు చాలా అవసరం కాబట్టి ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షణలో నీరు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఒకపక్క తాగునీరు మరోపక్క సాగునీరుకు ఆటంకం జరగకుండా చూసుకోవాలని ముఖ్యంగా ఇరిగేషన్ మినిస్టర్ ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఉండటం వల్ల అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఒకపక్క పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణంవల్ల ప్రజలకు గ్యాస్ తో పాటు నిత్యవసర వస్తువులు కూడా అందుబాటులోకి లేక అధిక ధరలతో అల్లాడుతున్నారని అలాంటి ఈ సందర్భంలో తాగేందుకు ప్రజలకు నీళ్ళు దొరికేలా చర్యలు తీసుకోవాలని ఎల్ నినో ప్రభావంతో ఈ సంవత్సరం వర్షాలు పడే పరిస్థితి లేదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని అందువల్ల ఏ ఏ ప్రాజెక్టులో ఎంత నీరు ఉన్నదో తెలుసుకొని తాగునీటి చెరువులను నింపి రిజర్వాయర్ నింపి ప్రజలను పశుపక్ష్యాదులను ఆదుకోవాలని ఆయన ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మి,, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ బీసీ హక్కుల సాధన సమితి పట్టణ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు

# హోటళ్ళు రెస్టారెంట్లపై డిస్టిక్ సివిల్ సప్లై ఆకస్మిక తనిఖీలు





మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:సివిల్ సప్లై విభాగం ఖమ్మం తనిఖీలు డొమెస్టిక్ సిలిండర్లు సీజ్ ఖమ్మం, 14-03-2026: జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి డి సి ఎస్ ఓ శనివారం రోజు ఖమ్మం టౌన్‌లో హోటళ్ళు మరియు రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో పలు హోటళ్ళు మరియు రెస్టారెంట్లు గృహ అవసరాల కొరకు మాత్రమే ఉపయోగించవలసిన డొమెస్టిక్ ఎల్ పిజీ సిలిండర్లను వాణిజ్య కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో మొత్తం 20 డొమెస్టిక్ ఎల్ పీజీ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇది చట్టవిరుద్ధమని డి సి ఎస్ ఓ స్పష్టం చేశారు.చర్యలు తీసుకున్నారు అక్రమంగా వాడుతున్న మొత్తం 20 డొమెస్టిక్ ఎల్ పీజీ సిలిండర్లను సీజ్ చేశారు. సంబంధిత హోటల్ యజమానులపై కేసులు నమోదు చేశారు. భవిష్యత్తులో మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.డిసిఎస్ ఓమాట్లాడుతూ డొమెస్టిక్ సిలిండర్లు ప్రభుత్వ సబ్సిడీపై సామాన్య గృహస్తుల కోసం మాత్రమే అందించబడతాయని, వాటిని వాణిజ్య అవసరాలకు దుర్వినియోగం చేయడం ఇసి ఎసిటి 1955, సెక్షన్ 6 ఎ కింద శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు.హోటళ్ళు, రెస్టారెంట్లు మరియు ఇతర వాణిజ్య సంస్థలు కేవలం కమర్షియల్ ఎల్ ఫీజీ సిలిండర్లు మాత్రమే వాడాలని, లేనిచో కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని డిసిఎస్ ఓ స్పష్టంగా తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని కూడా హెచ్చరించారు.జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి )డిసిఎస్ ఓ.

# ఆకట్టుకున్న పాఠశాల వైజ్ఞానిక ప్రదర్శన



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గ్రాడ్యుయేషన్ డే అనేది చిన్న పిల్లలకు పాఠశాల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయని శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ స్కూల్ చైర్ పర్సన్ నిష్టాశర్మ అన్నారు.శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యతిధిగా హాజరైన స్కూల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ...చిన్నారులు తమ ప్రాథమిక దశ విద్యను పూర్తి చేసి, తదుపరి దశకు దాటడం కోసం జరుపుకునే ఈ వేడుక రోజు చాలా జ్ఞాపకశక్తిని కలిగించే క్షణాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, లక్ష్య సాధన దిశగా కృషి చేస్తారని అన్నారు చిన్నారులకు గ్రాడ్యుయేషన్ ధృవపత్రాలు అందజేశారు. ఆకట్టుకున్న శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాల వైజ్ఞానిక ప్రదర్శన సాంకేతిక రంగాల్లో పరిశోధన, ప్రాజెక్టులను రూపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ముఖ్య వేదికలుగా నిలుస్తున్నాయని కెపియం స్కూల్ చైర్ పర్సన్ నిష్ఠాశర్మ అన్నారుశ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన శాల నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తిలకించారు ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఆసక్తి గల విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుత ఆవిష్కరణలు వెలుగులోకి తెచ్చే ఆవకాశం వుందనన్నారు. పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన శాల నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు తయారుచేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తిలకించారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఆసక్తి గల విద్యార్థులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుత ఆవిష్కరణలు వెలుగులోకి తెచ్చే ఆవకాశం వుందనన్నారు.కార్యక్రమంలో ఆర్ ఐ కామరాజు, ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంఅడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాదరావు పరిశీలించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 98 పరీక్ష కేంద్రాలలో కొనసాగుతున్న పరీక్షలను పురస్కారించుకొని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు బందోబస్తు పరిశీలించేందుకు శనివారం నగరంలోని జిహెచ్ ఎస్ శాంతి నగర్ మోంట్‌ఫోర్ట్ ఎయిడెడ్ స్కూల్,జిహెచ్ ఎస్ రాజేంద్ర నగర్,జిహెచ్ ఎస్ నయాబజార్ పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ ఎస్ ఎస్ అమలులో వున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల పరిసరాలలో ఇంటర్నెట్ సెంటర్లు , జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాపులు ఆయా సమయాలలో ముసివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించకుండా పోలీస్ పెట్రోలింగ్, పటిష్టమైన బందోబస్తు పర్యవేక్షణ వుండాలని సూచించారు.

# జర్నలిస్టుల అక్రిడేషన్ సమస్యలు పరిష్కరించండి



మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా :టి యు డబ్ల్యు జే (ఐ జే యు) ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రంమంత్రి పొంగులేటి, సమాచార శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఖమ్మం :జర్నలిస్టుల అక్రిడేషన్ మంజూరు విషయంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, అక్రిడేషన్ల జీవో లో ఉన్న ఇబ్బందులు సవరించాలని టి యు డబ్ల్యు జే (ఐ జే యు) జర్నలిస్టు యూనియన్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కి. శ్రీనివాస్ రెడ్డికి యూనియన్ నేతలు వినతి పత్రం అందజేసి సమస్యలు వివరించారు. శనివారం ఖమ్మం వచ్చిన మీడియా అకాడమీ చైర్మన్ కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే .రామనారాయణ తన నివాసంలో తేనేటి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కు జర్నలిస్టులు, సంఘ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మైస పాపారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు మామిడాల భూపాల్, కార్యదర్శి పి.మహేందర్, జిల్లా కోశాధికారి నాగండ్ల శివానంద తదితరులు శ్రీనివాస్ రెడ్డి సమస్యలను వివరించారు. ప్రధానమైన 8 డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లి సమాచార శాఖ కమిషనర్ తో చర్చించి జర్నలిస్టులకు ఇబ్బందులు లేకుండా అక్రిడేషన్లు మంజూరు చేస్తామని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఖమ్మం నగర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, నంచర్ల జనార్ధన చారి, జిల్లా ఉపాధ్యక్షులు మొయినుద్దీన్, జిల్లా నాయకులు పసుపులేటి సత్యనారాయణ, ఏగినాటి మాధవరావు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, వీడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు ఆలస్యం అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంఅడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాదరావు పరిశీలించారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 98 పరీక్ష కేంద్రాలలో కొనసాగుతున్న పరీక్షలను పురస్కారించుకొని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు బందోబస్తు పరిశీలించేందుకు శనివారం నగరంలోని జిహెచ్ ఎస్ శాంతి నగర్ మోంట్‌ఫోర్ట్ ఎయిడెడ్ స్కూల్,జిహెచ్ ఎస్ రాజేంద్ర నగర్,జిహెచ్ ఎస్ నయాబజార్ పరీక్ష కేంద్రాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ ఎస్ ఎస్ అమలులో వున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల పరిసరాలలో ఇంటర్నెట్ సెంటర్లు , జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ షాపులు ఆయా సమయాలలో ముసివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించకుండా పోలీస్ పెట్రోలింగ్, పటిష్టమైన బందోబస్తు పర్యవేక్షణ వుండాలని సూచించారు.

# స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం(గుట్ట) కు నూతన చైర్మన్‌గా డా. కూరపాటి ప్రదీప్ కుమార్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం (గుట్ట) చైర్మన్‌గా ప్రముఖ పిల్లల వైద్యులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ శనివారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా ఎండోమెంట్ అధికారి సమత, ఈవో జగన్మోహన్ రావు సమక్షంలో ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి దేవస్థానం చైర్మన్‌గా డా. ప్రదీప్ కుమార్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఆలయ పరిసరాలు భక్తుల సందడి, మంగళ వాయిద్యాల నినాదాలతో భక్తిమయంగా మారాయి. దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా డా. ప్రదీప్ కుమార్ తెలిపారు. దేవస్థానం కమిటీ సభ్యులుగా కర్నాటి రాధిక, చిన్ని మధుసూదన్ రావు, చల్లా మధుసూదన్ రావు, మోర్ల శ్రీనివాస్, మండదపు సాయి వెంకటకృష్ణ, కొల్లా నాగేందర్, చారుగుండ్ల రవికుమార్, పంతం సీతారాములు, శనగవరపు ప్రసాద్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కూరపాటి ప్రదీప్ కుమార్ బాధ్యతల స్వీకార మహోత్సవం సందర్భంగా గుట్టపై పండుగ వాతావరణం నెలకొంది.

# ఆశా వర్కర్ల ఆగ్రహం సమస్యలు పరిష్కరించకపోతే అసెంబ్లీ ముట్టడి హెచ్చరిక



(మన ప్రజా ప్రతినిధి ఫిబ్రవరి 14): సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ అధికారికి ఆశా వర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్ వేతనం చెల్లించాలని, ఎన్ హెచ్ ఎం ద్వారా ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి సరిపడ నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.అలాగే జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన పారితోషికాలను వెంటనే చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.1500 పారితోషికాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. 2021 జూలై నుండి డిసెంబర్ వరకు ఉన్న ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని కూడా వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఆశా వర్కర్లు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మార్చి 16, 17 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నాలు, మార్చి 20న మంత్రుల నివాసాల ముందు నిరసనలు, అలాగే మార్చి 28న "చలో హైదరాబాద్" కార్యక్రమంతో అసెంబ్లీ ముట్టడి చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల మండల అధ్యక్షురాలు కె. బాలమణి, ఎండి షహిన్ సుల్తాన్, బోల్లం రేణుక, టి. భాగ్య, టి. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామం పచ్చగా మారేందుకు చర్యలు సర్పంచ్ దుర్గేష్ ఆధ్వర్యంలో నర్సరీ ఏర్పాటు




(మన ప్రజా ప్రతినిధి మార్చ్ 14):దీపాయంపల్లి గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నర్సరీ ఏర్పాటుదౌల్తాబాద్ మండలంలోని దీపాయంపల్లి గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ నర్సరీ ఏర్పాటు చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ గద్వాల్ దుర్గేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గజ్వేల్ దుర్గేష్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు నర్సరీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చెట్లు, మొక్కలు బాగా పెరిగేలా ప్రతి మొక్కకు చల్లదనం ఉండేందుకు ప్రత్యేకంగా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాన్ని మరింత పచ్చగా, స్వచ్ఛంగా మార్చడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మసూరి శ్రీశైలం, వార్డ్ మెంబర్ చెక్కురు స్వామి, పంచాయతీ కార్యదర్శి, పారిశుద్ధ్య కార్మికులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించాలి సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 14,:యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని,వ్యాపార రంగంలో ముందుకు రావాలనిదుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు.చేగుంట లోని ఎస్ వి మైబైల్ షాప్ ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తాను మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో యువత సృజనాత్మక ఆలోచనలతో స్వయం ఉపాధి రంగంలోకిఅడుగుపెడితే ఆర్థికంగా స్వావలంబన సాధించడమే కాకుండా, మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించగలరన్నారు. చేగుంట పట్టణ పరిసర ప్రాంత ప్రజలకు సమీపంలో అందుబాటులో ఉండే విధంగా 'ఎస్ వి మొబైల్ షాప్ ఏర్పాటు కావడం సంతోషకరమని తెలిపారు. నాణ్యమైన మొబైల్స్ ను సరసమైన ధరల్లో అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలని యజమానులకు సూచించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ సంద్రుగు సతీష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగలరావు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, సంద్రుగు శ్రీకాంత్,వార్డ్ మెంబెర్స్ లు తదితరులు పాల్గొన్నారు. స్థానికులు పెద్ద ఎత్తున హాజరై యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 14:చేగుంట మండల కేంద్రంలో దేశంలోనే విద్యార్థులు, యువత బంగారు భవిష్యత్తును మాదకద్రవ్యాలు,నాశనం చేస్తున్నాయని చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి అన్నారు. ఈరోజు మాదక ద్రవ్య రహితంగా తీర్చిదిద్దడమే "నశా ముక్త భారత అభియాన్"ప్రధాన ఉద్దేశం గా మెదక్ చౌరస్తా లో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి మాట్లాడుతూ గుణంకాల ప్రకారం 25 ఏళ్లలోపు యువత అధికంగా బానిసలు అవుతుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. మాదక ద్రవ్యాలు మానసిక, శారీరిక ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలు అని, ఇవి యువతను చెడు మార్గంలో నడిపిస్తాయని, చదువులో వెనకబడేలా చేస్తాయన్నారు. ఒకసారి దీనికి బానిసైతే ఎంతటి ఆకృత్యాలు నేరాలు చేయడానికి వెనకాడనన్నారు. ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించాలని తగు సూచనలు తెలిపి ,మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అందరూ పాటుపడాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ,ఎస్ఐ, సంయోద్దీన్ పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, బోనాల సర్పంచ్ రాములు, మొహమ్మద్ అలీ,తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాప్రతినిధి పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మనప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 14 మార్చ్ :సమాజ శ్రేయస్సు కోసం వార్తా సంస్థలు నిరంతరం కృషి చేయాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో 'మన ప్రజా ప్రతినిధి' పత్రిక మరియు టీవీ ఛానల్ యొక్క నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. 'మనప్రజాప్రతినిధి' పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. తన చేతుల మీదుగా ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.పత్రికలు మరియు టీవీ ఛానళ్లు సామాజిక బాధ్యతతో పనిచేయాలని, ప్రజల గొంతుకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.మీడియా రంగంలో 'ప్రజా ప్రతినిధి' సంస్థ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.పత్రిక అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 'ప్రజా ప్రతినిధి' జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పులి మల్లేశం, మానకొండూరు అసెంబ్లీ రిపోర్టర్ బత్తిని ఆంజనేయులు,మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# చేగుంట లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు పరిశీలించిన సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట :చేగుంట పట్టణ కేంద్రం లో సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, వార్డ్ మెంబర్స్ ఆధ్వర్యంలో లో జరుగుతున్న వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి, అనంతరం పలు వార్డుల్లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు.నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, సైడ్ డరైన్ పనులను పరిశీలించారు,పట్టణ కేంద్రం లో ఇంకా జరగాల్సిన అభివృద్ధి పనులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ లను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేం వెంగల్ రావు, మార్కెట్ కమిటీ మెంబెర్స్, స్థానిక వార్డ్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, సంద్రుగు శ్రీకాంత్,, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ లను పట్టుకున్న తాసిల్దార్ శివప్రసాద్







మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 14:మండలం లోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన, వాణిజ్య అవసరాలకు వాడుతున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లపై స్థానిక తహసీల్దార్లు శివప్రసాద్, ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి , ఆకస్మిక తనిఖీలు చేపట్టి,చేగుంట పట్టణ కేంద్రం లోని శ్రీ కృష్ణ గ్రాండ్ హోటల్03,,సమ్మెర్ ప్రీతీ షేర్ పంజాబీ ఫ్యామిలీ దాబా04,తెలంగాణ ఫ్యామిలీ ధాబా లో 03, మక్కారాజ్ పేట్ వై జంక్షన్ ధాబా వద్ద 05,మండలం లో మొత్తం 12 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు చేగుంట పట్టణ ప్రాంతాల్లో ప్రైవేట్ కంపనీలు ఉండడం వల్ల, ఇక్కడ వరస కార్మికులు రావడం వల్ల గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు, గ్యాస్ రిఫీలింగ్ నిర్వహకులకు, మిర్చి హోటల్ లకు అధిక రూపాయలకు అక్రమ రవాణా చేస్తూ, ప్రజలదనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని,వీరి పైన తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు,తాసిల్దార్ శివప్రసాద్ చేగుంట తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో గృహ అవసర గ్యాస్ కు ఎటువంటి కొరత లేదు అని,మున్ముందు అవసరములకు కావలసిన గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని ఇట్టి విషయములో ఎవరును భయభ్రాంతులకు గురికాకూడదని, ప్రజలు సోషల్ మీడియాలో వస్తున్నటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని తెలిపారు.ఈ కార్యక్రమం లో ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జై భరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు